డాలస్ ఎయిర్‌పోర్ట్‌లో కేటీఆర్‌కు తెలంగాణ ఎన్నారైలు, బీఆర్ఎస్ సెల్ ప్రతినిధులు, అభిమానుల ఘనస్వాగతం



డాలస్ ఎయిర్‌పోర్ట్‌లో 'తెలంగాణ టార్చ్‌బేరర్ కేటీఆర్' అంటూ ప్లకార్డులు పట్టుకుని స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ అభిమానులు

డాలస్‌లో జై తెలంగాణ

మొదటిపేజీ తరువాయి...

మహేశ్ బిగాల, బీఆర్ఎస్ యూఎస్ఏ అడ్వైజరీ చైర్మన్ మహేశ్ తన్నీరు సారథ్యంలో ఎన్నారైలు అపూర్వస్వాగతం పలికారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు (భారత కాలమానం ప్రకారం జూన్ 2వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు) యూఎస్ఏలోని డాలస్ నగరంలోని డాక్టర్ పెప్పర్ ఎరీనాలో రాష్ట్ర ఆవిర్భావ సంబురాలు, బీఆర్ఎస్ రజతోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని దాదాపు అన్ని రాష్ట్రాలు, అన్ని ప్రధాన నగరాల్లోని తెలంగాణ బిడ్డలు డాలస్‌కు చేరుకోవడంతో సందడి నెలకొన్నది. న్యూజెర్సీ, చికాగో, డెలావేర్, హ్యూస్టన్, టెక్సాస్, కొలంబస్, ఆస్టిన్, ఫ్లోరిడా, శాన్‌ఫ్రాన్సిస్కో, లాస్‌ఏంజెల్స్, న్యూయార్క్ తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా తెలంగాణబిడ్డలు డాలస్‌కు తరలివచ్చారు. యూఎస్ఏలోని పలు ప్రాంతాల్లో ఉంటున్న తెలంగాణ ప్రజలు డాలస్ వేదిక వద్దకు తెలంగాణలోని తమతమ సొంత జిల్లాల సంస్కృతీ, సంప్రదాయాలు, కళారూపాలు ఉట్టిపడేలా వేషధారణ, చిత్రపటాలు చేబూని రావడంతో డాక్టర్ పెప్పర్ ఎరీనా ప్రాంగణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డాలస్ ప్రాంగణంలో ఏ ఇద్దరు ఎదురుపడినా 'హాయ్.. నమస్తే'కు బదులు 'జై తెలంగాణ...జైజై తెలంగాణ', 'జై కేసీఆర్... జైజై కేసీఆర్' అంటూ పలకరించుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణలో ప్రస్తుతం అన్ని వర్గాల్లో నెలకొన్న అసంతృప్తిని పారద్రోలే శక్తి, సత్తా ఒక్క కేసీఆర్‌కే ఉన్నదని తెలంగాణ ఎన్నారైలు చర్చించుకోవడం కనిపించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ నాయకత్వంలో తాము విదేశాల్లో ఉన్నా తెలంగాణ విముక్తి కోసం, ఆత్మగౌరవ పోరాటాలు చేశామని, అయితే, ప్రస్తుతం తెలంగాణలో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయని, దగా పడుతున్న తెలంగాణ తిరిగి దరికి చేరేందుకు నాడు రాష్ట్ర సాధన కోసం ఉద్యమించినట్టుగానే ప్రస్తుతం మరోసారి కార్యరంగంలోకి దిగాల్సిన సమయం ఆసన్నమైందని ఎన్నారైలు చర్చించుకుంటున్నారు. తెలంగాణ సాంస్కృతిక చైతన్యాన్ని రగిలించేందుకు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తోపాటు అమెరికాలోని వివిధ ప్రాంతాల్లోని తెలంగాణబిడ్డలు బతుకమ్మ, బోనాలతో కళారూపాలు ప్రదర్శించడం ఆహూతులను విశేషంగా ఆకర్షించింది.

డాలస్ ఎయిర్‌పోర్టులో కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు పుష్పగుచ్ఛాలతో వచ్చిన బీఆర్ఎస్ ఎన్నారై గ్లోబల్ సెల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల, బీఆర్ఎస్ యూఎస్ఏ అడ్వైజరీ చైర్మన్ మహేశ్ తన్నీరు తదితరులు

కేటీఆర్‌కు అపూర్వ స్వాగతం

డాక్టర్ పెప్పర్ ఎరీనా ప్రాంగణంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సంబురాలు, బీఆర్ఎస్ రజతోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం తెల్లవారుజామున (మనకు ఆదివారం ఉదయం 5 గంటలకు) డాలస్ విమానాశ్రయానికి చేరుకున్నారు. కేటీఆర్ రాక సందర్భంగా విమానాశ్రయం ప్రాంగణం అంతా గులాబీమయమైంది. రాష్ట్రంలోని అన్ని జిల్లా నుంచి అమెరికాలో ఉంటున్న తెలంగాణబిడ్డలు విమానాశ్రయానికి చేరుకొని కేటీఆర్‌కు అపూర్వస్వాగతం పలికారు. 'వెల్కం టు టార్చ్ బేరర్ ఆఫ్ తెలంగాణ.. మిస్టర్ కేటీఆర్', 'సిరిసిల్ల టు సిలికాన్ వ్యాలీ' అంటూ ప్లకార్డులతో యువకులు, పార్టీ ఎన్నారై విభాగ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికారు. కేటీఆర్‌కు స్వాగతం పలికినవారిలో పార్టీ ఎన్నారై సెల్ గ్లోబల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల, బీఆర్ఎస్ యూఎస్ఏ అడ్వైజరీ చైర్మన్ మహేశ్ తన్నీరు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి, గంగుల, కొప్పుల ఈశ్వర్, వీ శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిశోర్, చంటి క్రాంతికిరణ్, కోరుకంటి చందర్, పైలట్ రోహిత్‌రెడ్డి, గువ్వల బాలరాజు, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, కోలేటి దామోదర్ తదితరులున్నారు. ఎన్నారైల్లో రావు కల్వల, తిరుపతిరెడ్డి, ఆశిష్‌యాదవ్, అభిలాశ్ పాల్గొన్నారు. ఉదయ్ యాదవ్, సామ్ పుసపల్లి, శశి, అనిల్‌తోపాటు యువకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

విమానాశ్రయం నుంచి స్పెషల్ ఎస్కార్ట్

అమెరికాలో కేటీఆర్ ల్యాండ్ అయినప్పటి నుంచి గతంలో కన్నా ఇప్పుడు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. అఫీషియల్స్ ప్రొటోకాల్‌ను ఏర్పాటుచేశారు. ఆ ఆఫీషియల్స్ గుర్తించినవారిలో ఇన్నర్ సర్కిల్‌లోకి తీసుకున్నారు. భద్రతా కారణాలతో మిగిలినవారిని ఔటర్ సర్కిల్‌లో ఉంచారు. విమానాశ్రయం నుంచి కేటీఆర్‌ను స్పెషల్ ఎస్కార్ట్, కాన్వాయ్‌తో డాలస్‌లోని విడిది కేంద్రానికి వెళ్లడం మరో విశేషం.

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి

- సీఎం రేవంత్‌రెడ్డి ఏడాదిన్నర పాలనలో అన్నిరంగాలు కుదేలు
- కేసీఆర్ పదేండ్ల పాలనలో అభివృద్ధిపథంలో తెలంగాణ
- మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్
- గ్రేటర్ అట్లాంటాలో ఘనంగా సాంస్కృతిక దినోత్సవం

హైదరాబాద్ జూన్1 (నమస్తేతెలంగాణ): తెలంగాణలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని బీఆర్ఎస్ మాజీ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. రేవంత్‌రెడ్డి ఏడాదిన్నర పాలనలో అన్ని రంగాలు కుదేలయ్యాయని విమర్శించారు. అబద్ధాలు చెప్పి, అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అన్ని వర్గాలను మోసం చేసిందని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పాలనలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదని స్పష్టంచేశారు. అమెరికాలోని గ్రేట్ ర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సాం స్కృతిక వేడుకలకు శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధిపథంలో ముందుకు సాగిందని వివరించారు. ఐటీతోపాటు అన్నిరంగాలు గణనీయంగా అభివృద్ధి సాధించాయని చె ప్పారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించి అధికారంలోకి రావ డం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. సమున్నతమైన తెలంగాణ సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ జనరల్ ఆఫ్ ఇండియా రమేశ్‌బాబు, పద్మశ్రీ అవార్డీ విఠలాచార్య, సెనేటర్ షాన్‌స్టీల్, జార్జియ ప్రతినిధి జోన్స్, కార్టర్, ప్రొటెం మేయర్ దిలీప్ తుంకి, కౌన్సిల్ మెంబర్ బోబ్ ఎర్రమిల్లి, జాన్స్ క్రీక్, సిటీ పోలీస్ చీఫ్ మార్క్ మిచెల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	39.4°c	25.4°c
ఖమ్మం	38.0°c	26.0°c
రంగారెడ్డి	37.5°c	22.2°c
నల్లగొండ	37.5°c	28.0°c
నిజామాబాద్	36.1°c	26.4°c
కరీంనగర్	36.0°c	27.0°c
మహబూబ్‌నగర్	36.0°c	26.0°c
హైదరాబాద్	34.8°c	25.2°c
మెదక్	33.9°c	26.0°c
వరంగల్	29.0°c	22.0°c

వేసవిలో 206% అధిక వర్షపాతం

గత నాలుగేండ్ల వేసవిసీజన్‌లో ఇదే రికార్డు

గణాంకాలు వెల్లడించిన వాతావరణ శాఖ

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా వేసవి సీజన్‌లో అధిక వర్షపాతం నమోదైన్నట్టు వాతావరణశాఖ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. కురవాల్సిన మోతాదు కంటే అధికంగా ఈ ఏడాది వేసవిలో వర్షం కురిసిందని తెలిపింది. ఈ మూడునెలల వేసవికాలంలో రాష్ట్రంలో సగటున 55.1 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 166.4 మి.మీ వర్షపాతం నమోదైన్నట్టు వివరించింది. వాతావరణ మార్పుల కారణంగా గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు కనిపించినా.. మొత్తంగా సీజన్ మాత్రం వానలతో గడిచిపోయినట్టు పేర్కొన్నది. మొత్తంగా కురవాల్సిన వర్షపాతం కంటే 206శాతం అధికంగా వర్షాలు కురిశాయని తెలిపింది. గత నాలుగేండ్ల వేసవిసీజన్‌లో ఇదే రికార్డు అని పేర్కొన్నది. నిరుడు వేసవిలో 160శాతం వర్షాలు కురిస్తే.. ఈఏడాది దానికి రెట్టింపు కురిసినట్టు వివరించింది. 2022 వేసవి సీజన్‌లో సగటున 42.2 మి.మీ, 2023లో 60 మి.మీ, 2024లో 80.5 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైన్నట్టు వాతావరణశాఖ వెల్లడించింది. నిరుడు ఎల్‌నినో ప్రభావంతో నైరుతి సీజన్‌లో వర్షపాతం గణాంకాలు ఆశాజనకంగా లేవని గుర్తుచేసింది. ప్రస్తుతం ఈ వర్షకాల సీజన్‌లో వానలు ఆశాజనకంగా ఉన్నట్టు వెల్లడించింది.

మేలో 80శాతం అధిక వర్షపాతం

ఈ ఏడాది మార్చి నెలలో సాధారణం కంటే కాస్త తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ ..ఏప్రిల్ నెలలో మాత్రం అధిక వర్షపాతం నమోదైన్నట్టు వాతావరణశాఖ పేర్కొన్నది. ఇక మేనెలలో 80శాతం అధికంగా వర్షాలు కురిశాయని తెలిపింది. మేనెలలో బంగాళాఖాతంలో అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో వర్షాలు భారీగా నమోదయ్యాయని వెల్లడించింది. మరోవైపు ముందస్తుగా రుతుపవనాల రాకతోనూ రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో వర్షాలు మోస్తరు నుంచి భారీగా కురిసినట్టు తెలిపింది.

ఐదురోజులు తేలికపాటి వర్షాలు

నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో ఐదురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. గడిచిన 24గంటల్లో ఖమ్మంజిల్లా సింగరేణి మండలంలో 7.21 సెం.మీ, కామేపల్లిలో 4.77, వరంగల్ జిల్లా ఖానాపూర్‌లో 6.08, సంగెంలో 5.89, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ఇల్లందులో 4.81, నల్లగొండ జిల్లా నిడమనూర్‌లో 4.28 సెంటిమీటర్ల వర్షం నమోదైన్నట్టు తెలిపింది. సోమవారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్-భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట తదితర జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది.

కేటీఆర్ యూకే పర్యటన సక్సెస్

- తెలంగాణ విజయాలను వివరిస్తూ పెట్టుబడులను ఆహ్వానిస్తూ మీటింగ్స్
- బీఆర్ఎస్ యూకే సెల్ నేతలతో మీట్
- బ్రిడ్జ్ ఇండియా సదస్సుకు హాజరు
- పెట్టుబడులు పెట్టాలంటూ విజ్ఞప్తి
- లండన్ ఎయిర్‌పోర్ట్‌లో వీడ్కోలు
- భారీగా తరలివచ్చిన అభిమానులు
- లండన్ నుంచి డాలస్‌కు పయనం
- నేడు డాలస్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొననున్న కేటీఆర్

యూకేలో ఎన్నారై మీట్‌లో మాట్లాడుతున్న కేటీఆర్ (ఫైల్)

హైదరాబాద్ జూన్1 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యూకే పర్యటన జయప్రదమైంది. ఐదురోజుల పాటు ఇంగ్లండ్‌లో పర్యటించిన ఆయన పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సాధించిన విప్లవాత్మక విజయాలను వివరించారు. అధికారం లేకున్నా విదేశీగడ్డపై తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్తూ ఇండియాలో పెట్టుబడులు పెట్టాలని, అందులో తెలంగాణను బెస్ట్ చాయిస్‌గా ఎంచుకోవాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. ఆదివారం డాలస్‌కు పయనమయ్యారు. అక్కడ సోమవారం నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు, బీఆర్ఎస్ రజతోత్సవాల్లో పాల్గొననున్నారు. లండన్‌లోని తెలంగాణ ప్రవాసులు, బీఆర్ఎస్ యూకే విభాగం నాయకులు, కార్యకర్తలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఐదురోజుల పాటు ఇంగ్లండ్‌లో కేటీఆర్ అనేక ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో సాధించిన ప్రగతిని గణాంకాలతో వివరించారు. బీఆర్ఎస్ ఎన్నారైలతో మమేకమయ్యారు. వారి సాధకబాధ కాలను తెలుసుకున్నారు. ప్రత్యేక రాష్ట్ర పోరాటంలో వారి కీలకపాత్రను గుర్తుచేస్తూ అప్పటి అనుభూతులను పంచుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తిరోగమన విధానాలను ఎండగట్టాలని సూచించారు.

ఎన్నారై నేతలతో సమావేశం

మే 27న యూకేలో అడుగుపెట్టిన కేటీఆర్‌ను వివిధ రంగాల ఎన్నారై ప్రముఖులు కలిశారు. కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి కోసం సాగుతున్న పోరాటానికి అడుగడుగునా అండగా ఉంటామని ప్రకటించారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా గుండె సంబంధ ఆపరేషన్ తర్వాత కోలుకుంటున్న బీఆర్ఎస్ ఎన్నారై నేత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ అనిల్ కుర్మాచలం ఇంటికి వెళ్లి, ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని భరోసానిచ్చారు. 28న బీఆర్ఎస్ ఎన్నారై సెల్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ నేతలతో లండన్‌లో కేటీఆర్ సమావేశమయ్యారు. పార్టీ పటిష్టతకు చేస్తున్న కృషిని అభినందించారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించారని ప్రశంసించారు. అక్కడి నేతల విజ్ఞప్తి మేరకు లండన్‌లో రజతోత్సవాలను నిర్వహించేందుకు సుముఖత వ్యక్తంచేశారు. అనంతరం యూకే తెలుగు బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు.

బ్రిడ్జ్ ఇండియా సదస్సులో కీలకోపన్యాసం..

మే 30న బ్రిడ్జ్ ఇండియా వీక్-25 సదస్సులో కేటీఆర్ చేసిన కీలకోపన్యాసం దేశవిదేశాల ప్రతినిధులను ఆకట్టుకున్నది. సుస్థిరమైన ఆర్థికాభివృద్ధితో ప్రపంచానికి తెలంగాణ దిక్సూచిగా నిలిచిన తీరును తనదైన శైలిలో వివరించారు. సంపద సృష్టించి పేదలకు పంచే విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన విధానాలను క్లుప్తంగా తెలియజెప్పారు. అనంతరం వార్విక్ యూనివర్సిటీలో మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ లాంటి దిగ్గజ సంస్థలకు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సేవలు అందించే పీడీఎస్ఎల్ నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించారు. ప్రతిష్ఠాత్మక కంపెనీల్లో తెలంగాణ బిడ్డలు సేవలందించడం మనందరికీ గర్వకారణమని ప్రశంసించారు. బీఆర్ఎస్ సర్కారు అనుసరించిన అత్యుత్తమ పాలసీలతో పుణె, చెన్నయ్ తర్వాత హైదరాబాద్ ఆటోమోటివ్ హబ్‌గా మారిన తీరును వివరించారు. పెట్టుబడులు వెల్లువెత్తి తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు లభించాలని ఆకాంక్షించారు. యూకే పర్యటన విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. లండన్‌లో కార్యక్రమాలను ముగించుకున్న కేటీఆర్ అక్కడి నుంచి అమెరికాలోని డాలస్‌లో పార్టీ సోమవారం తెల్లవారుజామున (భారత కాలమానం ప్రకారం) నిర్వహించనున్న రజతోత్సవ సంబురాల సభకు బయల్దేరి వెళ్లారు.

కేటీఆర్‌ను కలిసేందుకు కనెక్టికట్ నుంచి డాలస్‌కు చేరుకున్న తర్వాత మిత్రులతో కిశోర్

కేటీఆర్‌ను కలిసేందుకు 3,218 కిలో మీటర్ల జర్నీ

- కేసీఆర్-టీఆర్ఎస్ ప్లేట్‌తో ఉన్న కారులో ఎల్లారెడ్డి నియోజకవర్గ యువకుడు కిశోర్ సాహస యాత్ర
- కనెక్టికట్ నుంచి డాలస్‌కు పయనం

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): తన అభిమాన నేత.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసేందుకు ఓ యువకుడు సాహసోపేత ప్రయాణం చేశాడు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లంకలపల్లికి చెందిన కిశోర్ లింగారెడ్డికి కేటీఆర్ అంటే ఎంతో అభిమానం! కేటీఆర్‌ను ఒక్కసారైనా కలువాలనేది అతడి కోరిక.. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న అతడు డాలస్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సంబురాల సభకు కేటీఆర్ వస్తున్నారని, అక్కడ కలవాలని నిర్ణయించుకున్నాడు. అమెరికాలోని కనెక్టికట్ నుంచి అనేక రాష్ట్రాలను చుట్టేసి, రజతోత్సవ సంబురాల ఆవశ్యకత గురించి ప్రచారం చేస్తూ కేసీఆర్-టీఆర్ఎస్ అనే ప్రత్యేక ప్లేట్ వేయించుకొని కారులో బయలుదేరాడు. 3,218 కిలోమీటర్లు (2000 మైళ్లు) ప్రయాణించి డాలస్ చేరుకున్నాడు. బీఆర్ఎస్ రజతోత్సవ సంబురాల్లో పాల్గొని కేటీఆర్‌తో ఫొటో దిగాలనే తన చిరకాల కోరికను తీర్చుకోనున్నట్టు కిశోర్ తెలిపాడు.

తెలంగాణలో పీడీఎస్ఎల్‌ను విస్తరిస్తాం

- మాజీ మంత్రి కేటీఆర్ స్ఫూర్తితోనే హైదరాబాద్‌లో అడుగుపెట్టాం
- సెప్టెంబర్‌లో ఆఫీస్‌ను ప్రారంభిస్తాం
- ఆరు దేశాల్లో సేవలు అందిస్తున్నాం
- యూకేలో మా నాలెడ్జ్ సెంటర్‌ను కేటీఆర్ ప్రారంభించడం గర్వకారణం
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో పీడీఎస్ఎల్ డైరెక్టర్ క్రాంతి పుప్పాల

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): ఆటోమోటివ్ రంగంలో తెలంగాణ రాష్ట్రాన్ని కీలక కేంద్రంగా మార్చేందుకు తమవంతు కృషిచేస్తామని 'ప్రాగ్మటిక్ డిజైన్ అండ్ సొల్యూషన్స్ లిమిటెడ్' (పీడీఎస్ఎల్) డైరెక్టర్ క్రాంతి పుప్పాల తెలిపారు. ఆయన యూకే నుంచి ప్రత్యేకంగా 'నమస్తే తెలంగాణ'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. హైదరాబాద్‌ను ఆటోమోటివ్ హబ్‌గా మార్చాలనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆలోచనా స్ఫూర్తితో హైదరాబాద్‌లో తమ సంస్థను ప్రారంభించామని తెలిపారు. సెప్టెంబర్‌లో నూతన కార్యాలయం ప్రారంభిస్తామని చెప్పారు ఇంగ్లాండ్‌లోని వార్విక్ విశ్వవిద్యాయంలో తాము ఏర్పాటు చేసిన పీడీఎస్ఎల్ నాలెడ్జ్ సెంటర్‌ను కేటీఆర్ చేతులమీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉన్నదన్నారు. ఇంటర్వ్యూలో క్రాంతి పుప్పాల చెప్పిన సమాధానాలు ఆయన మాటల్లోనే..

ప్రశ్న: పీడీఎస్ఎల్ పరిశ్రమను తెలంగాణకు ఎలా విస్తరించారు?

జవాబు: హైదరాబాద్‌ను ఆటోమోటివ్ హబ్‌గా మార్చాలన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆలోచనే నాకు స్ఫూర్తి. దేశంలో పుణె తర్వాత హైదరాబాద్‌ను రెండో ఆటోమోటివ్ కేంద్రంగా చేయాలన్నది మా లక్ష్యం. హైదరాబాద్‌లో ఆటోమోటివ్ రంగం బలపడితే, విద్య-పరిశ్రమ సంబంధాలు మెరుగవుతాయి. యువతకు ఆచరణాత్మక శిక్షణ, నైపుణ్య అభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. వారు ప్రపంచ స్థాయి సాంకేతికతలతో పనిచేసే అవకాశం కలుగుతుంది.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విధానాలు ఎలా దోహదపడ్డాయి?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మొబిలిటీ కారిడార్‌ను అభివృద్ధి చేసి హైదరాబాద్‌ను పుణె, చెన్నై సరసన నిలిపింది. ఈ విధానాలు ఆటోమోటివ్ రంగంలో నూతన ఆవిష్కరణలకు, పెట్టుబడులకు ఊతమిచ్చాయి. ఇవి పరికరాల తయారీదారులకు, సరఫరాదారులకు ఖర్చు, సమయం తగ్గించి, నగరాన్ని ఆవిష్కరణల కేంద్రంగా మారుస్తాయి. ఇందులో భాగంగానే మేము హైదరాబాద్‌లో అడుగుపెట్టి, అధునాతన ఆటోమొబైల్ సేవలను అందిస్తున్నాం.

తెలంగాణ యువత నైపుణ్యాలను ప్రపంచ స్థాయిలో ఎలా ఉపయోగించవచ్చు?

స్థానిక ఇంజినీర్లు అంతర్జాతీయ సాంకేతిక తలతో పనిచేసే అవకాశం పొందితే, వారు ప్రపంచ స్థాయి ఉత్పత్తుల అభివృద్ధిలో భాగమవుతారు. ఇది వారి నైపుణ్యాలను, పోటీతత్వాన్ని పెంచుతుంది. మేము శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, వర్క్‌షాప్‌ల ద్వారా యువత నైపుణ్యాలను పెంచుతున్నాం. హైదరాబాద్‌లో ఈ కార్యక్రమాలను మరింత విస్తరించి, యువ తను గ్లోబల్ మార్కెట్‌కు తగ్గట్టు సిద్ధం చేస్తాం.

కేటీఆర్ ఆలోచనలు పీడీఎస్ఎల్‌కు ఎలా స్ఫూర్తినిచ్చాయి?

కేటీఆర్ దూరదృష్టి, హైదరాబాద్‌ను సేవల కేంద్రంగా మార్చాలనే ఆయన ఆలోచనలే మాకు స్ఫూర్తి. ఆయన యువతను ఉద్యోగ సృష్టికర్తలుగా మార్చే విధానం మమ్మల్ని ఆవిష్కరణల వైపు నడిపిస్తున్నది. కేటీఆర్ సేవల రంగం, డాటా భద్రత, మేధో సంపత్తి రక్షణలపై లోతైన అవగాహన కలిగి ఉన్నారు. ఆయన చేతుల మీదుగా మా సెంటర్ ప్రారంభం కావడం సంతోషంగా ఉన్నది.

ఆటోమోటివ్ రంగంలో ప్రస్తుతం వస్తున్న సాంకేతిక మార్పులు ఏమిటి?

ఏఐ, ఐవోటీ, 5జీ వంటి సాంకేతికతలతో ఆటోమోటివ్ రంగం రూపురేఖలు మారిపోతున్నాయి. సాఫ్ట్‌వేర్‌తో నడిచే కనెక్టెడ్ వాహనాలపై దృష్టి పెరిగింది. పీడీఎస్ఎల్ ఈ ట్రెండ్‌కు అనుగుణంగా ఆవిష్కరణలకు మద్దతు ఇస్తున్నది. మేము ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీ నిర్వహణ, పవర్ ఎలక్ట్రానిక్స్, వాహన నియంత్రణ వ్యవస్థల్లో పనిచేస్తున్నాం. స్టార్టప్‌ల నుంచి పెద్ద ఓఈఎంల వరకు మేము సేవలు అందిస్తున్నాం. యూనివర్సిటీ-ఇండస్ట్రీ సహకారం విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవం, ఆవిష్కరణలకు అవకాశం ఇస్తున్నది. తెలంగాణలో సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, హ్యాకథాన్‌లు, పరిశ్రమ-విద్యా సంబంధాలు ఈ ప్రక్రియను వేగవంతం చేస్తాయి.

హైదరాబాద్‌లో చదువు.. 6 దేశాల్లో సేవలు

పుప్పాల క్రాంతి స్వస్థలం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్. తండ్రి నర్సింగరావు ఐడీపీఎల్‌లో రిటైర్డ్ ఉద్యోగి. క్రాంతి ఇంటర్ వరకు హైదరాబాద్‌లోనే చదువుకున్నారు. యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ మెకానికల్ ఇంజినీరింగ్, జేఎన్‌యూలో ఎంబీఏ చేశారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో బిజినెస్ మేనేజ్‌మెంట్, బిజినెస్ డిజైన్ స్ట్రాటజీ చదివారు. 15 ఏండ్లుగా ఇంగ్లండ్‌లోని కోవెంట్రీలో ఉంటున్నారు. ప్రాగ్మటిక్ డిజైన్ సొల్యూషన్స్‌కు ఎండీగా కొనసాగుతున్నారు. పీడీఎస్ఎల్ ప్రధానంగా వాహన తయారీ పరిశ్రమలకు సాఫ్ట్‌వేర్, ఇంజినీరింగ్ సేవలు అందించే సంస్థ. ఇది 2010లో ప్రారంభమైన సంస్థ భారత్‌తోపాటు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, వియత్నాంలో సేవలందిస్తోందని, 700 మంది పని చేస్తున్నారని, వార్షిక టర్నోవర్ రూ.171.12 కోట్లు అని క్రాంతి పేర్కొన్నారు. కస్టమర్లకు అందుబాటులో ఉంటూ, వాహనాల పరీక్షలను సులభం చేయడమే తమ లక్ష్యమన్నారు. మెక్‌లారెన్, ఆస్టన్‌మార్టిన్, జాగ్వార్ కంపెనీలతో దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకున్నామన్నారు. 15 ఏండ్లలో తమ నమ్మకమైన, నాణ్యమైన సేవలతో బంధాలు బలపడ్డ